క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి విశేష పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలిమంగమ్మ సమేత స్వామివారి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యాక్రమాలను చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారికి పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎంఈఓ కార్యాలయానికి ప్రశ్న పత్రాలు



ప్రశ్నపత్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

సి.బెళగల్: పాఠశాలలో నిర్వహించనున్న వివిధ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు శనివారం ఎంఈఓ కార్యాలయానికి చేరుకున్నాయి. ఎంఈఓ జ్యోతి పరిశీలించారు. ఈనెల 3వ తేదీ నుంచి 1–9 వ తరగతి వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్–4 పరీక్షలు, అదేవిధంగా 10వ తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ జరగనుందన్నారు. ప్రశ్నపత్రాలను రోజువారీగా ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు.

వ్యాధులతో పశువుల్లో సామర్థ్యం తగ్గుదల



పశువుకు గాలికుంటు టీకా వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

సి.బెళగల్: ఎద్దుల్లో గాలికుంటు వ్యాధితో పనిచేసే సామర్థ్యం తగ్గుందని, అదే విధంగా పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందని సి.బెళగల్ పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక పశు వైద్యశాలలో జాతీయ పశువ్యాధి నియంత్ర దినోత్సవం సందర్బంగా పశువులకు ఉచితంగా గాలికుంటు టీకా కార్యక్రయం ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు సోకే వ్యాధులు, లక్షణాలు, నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. కాగా సి.బెళగల్ పశు వైద్యశాలకు 3,250 టీకాలు మంజూరు అయ్యాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధిలో గరిష్ట వేతనాలు పొందాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి పథకంలో ప్రతి కూలీ గరిష్ట వేతనం రూ.300 పొందేలా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సిబ్బందికి ఆదేశించారు. శనివారం మండల కేంద్రం ఓర్వకల్లు సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉపాధి కూలీలతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. రోజుకు కనీసం 4 గంటలు పని చేస్తే కనీస వేతనం పొందవచ్చన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని మజ్జిగ, చలువ పందిర్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

95శాతం పింఛన్లు పంపిణీ

కల్లూరు: మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ 95 శాతం జరిగినట్లు ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి అన్నారు. శనివారం తడకనపల్లె, నాయకల్లు గ్రామల్లో జరుగుతున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరించుకోండి

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ గృహ వినియోగదారులు స్వచ్ఛంద అదనపు లోడు క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ పర్యవేక్షక ఇంజినీరు ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులు చెల్లించవలసిన అభివృద్ధి రుసుములో 50 శాతం స్వచ్ఛందంగా చెల్లించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం మార్చి 31 నుంచి జులై 30వ తేదీ వరకు అమలులో ఉంటుందని ఆలోపు రుసుము చెల్లించాలని సూచించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో నిర్వహించిన అంతరాష్ట్ర ఎద్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా న్యూ కేటగిరి విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా రాయవరం అక్షరారెడ్డి వృషభాలు నిర్ణీత సమయానికి 5,700 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.40 వేలు దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యంరెడ్డి వృషభాలు 5,400 అడుగులు లాగి రెండో బహుమతి రూ.30 వేలు సాధించాయి. నంద్యాల మండలం పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి వృషభాలు 5,348 అడుగులు లాగి మూడో బహుమతి రూ.20 వేలను కైవసం చేసుకోగా, కడప జిల్లా, పొలంపల్లె రాయల్ రెడ్డి వృషభాలు, నాగర్‌కర్నూలు జిల్లా, రాయవరం అక్షరారెడ్డి (ఉభయ జత) ఎద్లు 5,375 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.10 వేలు సాధించాయి. గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలం, సాతర్ల గ్రామానికి చెందిన హర్షన్, అబ్దుల్ వృషభాలు 5,313 అడుగుల దూరం లాగి ఐదో బహుమతి రూ. 5 వేలను సంపాదించగా, కర్నూలు జిల్లా, బి.తాండ్రపాడుకు చెందిన రత్నం వృషభాలు 5,310 అడుగుల దూరం లాగి ఆరో బహుమతి రూ.3 వేలను గెలుచుకున్నట్లు రైతు సంఘం నాయకులు మల్లెల రాజశేఖర్ తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



పోలకల్ జెడ్పీ హైస్కూల్‌లో పది విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ

సి.బెళగల్: మండలంలో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అన్నారు. శనివారం మండల పరిధిలోని పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ రాణెమ్మ, ఎంఈఓ జ్యోతితో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకున్న ప్రమాదంపై హెచ్ఎం రమను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అదే విధంగా ప్రమాదంలో గాయపడిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పాఠశాల పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై లక్ష్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు తగిన సూచనలు చేయాలని తెలిపారు. అనంతరం మండల అధికారులు, పాఠశాల హెచ్ఎం, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

గూడూరు టీడీపీలో కుమ్ములాట

● టీడీపీ పట్టణ అధ్యక్షుడిపై దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్: గూడూరు తెలుగుదేశం పార్టీలో కుమ్ములాటలు మొదలయ్యాయి. శనివారం టీడీపీ గూడూరు పట్టణ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ గూడూరులోని 2వ వార్డులో పింఛన్లు పంపిణీ చేశారు. వార్డులోకి తన పర్మిషన్ లేకుండా ఎలా వస్తావు అంటూ టీడీపీ నేత సృజన గజేంద్రగోపాల్‌తో ఘర్షణకు దిగారు. ఒకరినొకరు నెట్టుకున్నారు. గజేంద్ర గోపాల్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జరిగిన విషయాన్ని జిల్లా, రాష్ట్ర టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాగా గతంలోనూ కోడుమూరు మండలం అమడగుంట్ల గ్రామంలో పింఛన్ల పంపిణీ, అభివృద్ధి పనులు చేపట్టడంలో స్థానిక టీడీపీ నాయకులు ఘర్షణకు దిగిన విషయం మరువకముందే గూడూరులో అధికార పార్టీ నాయకులు వార్డుపై పెత్తనం కోసం తన్నులాడుకోవడాన్ని ప్రజలు ఏవగించుకుంటున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి



పోలకల్‌లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

సి.బెళగల్: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. శనివారం మండల పరిధిలోని పోలకల్ ప్రాథమిక, మెయిన్ పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి, వంట గదులను పరిశీలించారు. రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థుల గైర్హాజరుపై టీచర్లను వివరణ కోరారు. అలాగే విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం పాఠ్యాంశాల బోధన, పాఠశాల నిర్వహణపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని స్పెషల్, రెగ్యులర్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు మునిస్వామి, తిమ్మన్న, రేవుల శ్రీనివాసులు, టీచర్లు ఉన్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం

పాణ్యం: జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని మహిళ సాధికారత, వికసిత్ భారత్ అంశంపై శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయిలో ఉప న్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరచగా వారిని ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం అభినందించి మాట్లాడారు. ఉపన్యాసం జూనియర్ విభాగంలో పాణ్యం ప్రభుత్వ ప్రాథమికోన్నత మెయిన్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సుహాన మొదటి స్థానంలో, ఇదే పాఠశాలకు చెందిన అప్సానా ద్వితీయ స్థానం సాధించారన్నారు. సీనియర్ విభాగంలో పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సి.చైతన్య సాయి ప్రథమ స్థానంలో, లక్ష్మీ గాయత్రి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నిహారిక ప్రతిభ చాటారన్నారు. అలాగే వ్యాసరచన జూనియర్ విభాగంలో పాణ్యం ప్రభుత్వ పాఠశాల మెయిన్‌లో 5 తరగతి చదువుతున్న ఆశ్విత మొదటి స్థానంలో, అదే పాఠశాలకు చెందిన సాహేస్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. సీనియర్ విభాగంలో పాణ్యంలోని ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సౌందర్య ప్రథమ స్థానంలో, పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సి. చైతన్యసాయి ద్వితీయ స్థానంలో ప్రతిభ చాటారన్నారు. క్విజ్ పోటీల్లో పాణ్యం ప్రభుత్వ పాఠశాలకు చెందిన చరణ్‌సాహిత్, మమత, చైతన్య సాయిలు ప్రథమ స్థానంలో నిలవగా, కెజీబీవీలో చదువుతున్న స్రవంతి, మహిమ, కీర్తనలు రెండో స్థానంలో నిలిచారన్నారు. వీరు జిల్లాలో జరిగి సైన్స్ డేలో పాల్గొంటారన్నారు. తర్వాత ఆయా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం లీలావతి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కొత్తూరులో న్యాయమూర్తుల పూజలు



జడ్జీలకు ప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరులో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శనివారం ముగ్గురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఆదోని, హిందుపూరం, కదిరి జిల్లాల న్యాయమూర్తులు పీజే సుధ, శైలజ, జయలక్ష్మిలకు సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు చేయించారు.

భోగేశ్వరుడి హుండీ ఆదాయం లెక్కింపు



అలయ ప్రాంగణంలో భోగేశ్వరుడిని హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

గడివేముల: మండల పరిధిలో గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరస్వామి హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. ఈ మహాశివరాత్రికి రూ .3,49,394 ఆదాయం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపును సీఎఫ్ఓ హరిచంద్రారెడ్డి, పర్యవేక్షించారు. కార్యక్రమంలో సేవాకమిటీ సభ్యులు, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇంజినీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్, అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆ రెండు కళాశాలల ఎదుట సీపీఎం మండల నాయకుడు మధు అధ్యక్షతన రెండు రోజుల దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రామకృష్ణ, మండల కార్యదర్శి ఎ.కృష్ణ మాట్లాడుతూ దూపాడు గ్రామంలో సుమారుగా 300 కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. గ్రామా న్ని కార్పొరేషన్‌లో విలీనం చేశారు కాని మౌలిక వసతులు కల్పించలేదన్నారు. గ్రామ సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి, అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలల్లోని వ్యర్థపదార్థాలు హంద్రీ నదిలోని రింగుబావిలో కలుస్తున్నాయన్నారు. దీంతో తాగు నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించే వరకు దీక్ష కొనసాగిస్తామని చెప్పారు. ఈ ఆందోళనకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీలు మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శి అబ్దుల్లా, రంగప్ప, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, నాయకులు హరిబాబు, షేక్షావలి, ఈశ్వర్, వినోద్, గాలేన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి

కల్లూరు:దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలో ఫ్రెషర్స్‌డేను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ, కార్పొరేటర్ పద్మాలతరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): నగరంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో మునిసిపల్ అధికారులతో సమావేశం అయ్యారు. నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రగతి ప్రణాళికలు రూపొందించాలన్నారు. శంఖుస్థాపన చేసిన పనులను గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని 52 వార్డుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని, ఎప్పటికప్పుడు చెత్తను సేకరించాలని, దోమలు, వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న మంత్రి

కర్నూలు (టౌన్): నగరంలో శనివారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రారంభమైంది. స్థానిక బంగారుపేటలో మంత్రి టీజీ భరత్ పింఛన్‌దారులకు సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ 1వ తేదీనే పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో మొదటి రోజు 35,358 పెన్షన్లకు గాను 34,191 మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. అందుబాటులోని 1,177 మందికి సోమవారం సాయంత్రంకల్లా పింఛన్లను పంపిణీ చేసి వంద శాతం పూర్తి చేస్తామన్నారు.

వర్మీకంపోస్టు ఎరువు తయారీ చేయాలి

కల్లూరు: గ్రామ పంచాయతీల్లో ఉన్న చెత్త సంపద (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాల నుంచి వర్మీకంపోస్టు ఎరువు తయారీ చేయాలని ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి సూచించారు. శనివారం ఆయన నాయకల్లులో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థినికి పరామర్శ



కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థిని శ్రీలేఖను పరామర్శిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

సి.బెళగల్: మండలంలోని పోలకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తుండగా చెట్టు విరిగి పడడంతో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శ్రీలేఖను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పరామర్శించారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆసుపత్రికి వెళ్లి బాలిక ఆరోగ్య పరిస్థితిని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. విద్యార్థిని శ్రీలేఖ ఆరోగ్య పరిస్థితి శుక్రవారం సాయంత్రం విషమించడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. రాత్రంతా ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందించడంతో బాలిక శనివారం ఉదయానికి కాస్త కోలుకుంది. బాలికకు రక్తం తగ్గడంతో అవసరమైన మేర బాటిళ్లతో ఎక్కించారు. పల్స్, ఆక్సిజన్ లెవల్స్ సాధారణ స్థితికి వచ్చినట్లు వైద్యులు తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, వైద్యులు ఉన్నారు. అదే విధంగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు, నాయకులు బాధితురాలిని పరామర్శించారు. కాగా పాఠశాలలో ప్రమాదానికి కారణమైన చెట్టుతో పాటు, ఎండిన చెట్లను పాఠశాల హెచ్ఎం రమ కూలీలతో తొలగించారు.



పోలకల్ జెడ్పీ హైస్కూల్‌లో ఎండిన చెట్లను తొలగిస్తున్న హెచ్ఎం రమ

భక్తిశ్రద్ధలతో భోగేశ్వరుడి వసంతోత్సవం





భోగేశ్వరుడికి కోనేరులో వసంతోత్సవం నిర్వహిస్తున్న భక్తులు, పార్వేట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: శ్రీ దుర్గాభోగేశ్వరుడి ఆలయంలో గత నాలుగు రోజుల నుంచి జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు శనివారం వసంతోత్సవంతో ముగిశాయి. స్వామివారికి ఉదయం తిరుమంజనము, నాకబలి, వసంతోత్సవం, ధూపదీప నైవేద్యములు సమర్పిచారు. ఆలయప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ అధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రధానకోనేరులో స్వామివారికి అవభృతస్నానము నిర్వహించారు. తర్వాత పారువేట కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సాయంత్రం గడిగరేవుల గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రామానుజన్,ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



డాన్స్ చేస్తున్న విద్యార్థులు



వంటలు తయారు చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో సిగ్మా (14 జాతీయ స్థాయి సాంకేతిక సమ్మేళనం) రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రెండవ రోజు విద్యార్థులకు కళా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇందులో చిత్ర లేఖనం, నృత్యాలు, సుడోకు, ఫజిల్ పరిష్కారం, అగ్నివిహీన, వంటల పోటీలు, ఖజానా వేట, మెహందీ కళా, ఫ్యాషన్ షో, ఫొటోగ్రఫీ, స్టాండప్ కామెడీ వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తమ విద్యార్థులు ఈ రంగాల్లో ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కోడుమూరు పరీక్ష కేంద్రం వద్ద హాల్ టిక్కెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



పాణ్యం జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కోడుమూరు రూరల్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కోడుమూరులో రెండు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 176 మంది విద్యార్థులకు గాను 7 మంది విద్యార్థులు, మోడల్ స్కూల్‌లో 164 మంది విద్యార్థులకు గాను 7 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ పద్మావతి, ఆశాజ్యోతి తెలిపారు.

పాణ్యం: ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.తొలి రోజు పరీక్షకు పాణ్యం కళాశాలలో 230 మందికి గాను ఆరుగురు గైర్హాజరయ్యారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సయ్యద్‌బాబు తెలిపారు. అలాగే నెరవాడ ఏపీటీడబ్ల్యూఆర్ జేసీ కళాశాలలో 264మందికి గాను 3 గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రామ నాయక్ చెప్పారు.

అక్రమ మద్యం పట్టివేత

కర్నూలు: ఎక్సైజ్ అధికారుల తనిఖీలో అక్రమ మద్యం పట్టుబడింది. కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ ఆధ్వర్యంలో ఎస్ఐలు నవీన్, రెహనా బేగం తమ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి శనివారం వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కల్లూరు మండలం దొడ్డిపాడుకు చెందిన పకీర్ దస్తగిరి నుంచి 12 కర్ణాటక మద్యం బాటిళ్లు, అలాగే కర్నూలు శ్యామల నగర్‌లోని వెంకటరామయ్య ఇంట్లో 10 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే బుధవారపేటలో నాటుసారా స్థావరాలపై తనిఖీలు నిర్వహించి.. సారా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 5వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు సీఐ చంద్రహాస్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్ కార్డుతో పాటు ధరావత్ సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాల్సిందిగా సూచించారు.

5న రంగనాథస్వామి కల్యాణోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గోదా గోకులం సభ్యులు

కర్నూలు కల్చరల్: శ్రీరంగనాథ స్వామి దేవాలయం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 5వ తేదీన శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త పేర్కొన్నారు. ఆయన శనివారం బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఆదివారం నుంచి 8వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు.రోజూ ఉదయం 6.30 నుంచి 12.30 గంటలు, సాయంత్రం 5.30 నుంచి 9 గంటల వరకు వేడుకలు జరుగుతాయన్నారు.